

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు : విసి

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం ఎంబిఏ విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పిస్తామని విసి ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. వైవియూ గురుకుల భవనాలను, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథ రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులతో కలసి భవనాలను, తరగతి గదులను పరిశీలించారు. ఈ ఏడాది ఎంబిఏ, హెచ్ఆర్ఎం, కామర్స్ కోర్సుల్లో విద్యార్థుల సంఖ్య పెరిగిన దృష్ట్యా తరగతి గదుల నవీకరణ చేస్తామన్నారు. విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన ఏర్పాట్లపై వైవియు ఇంజనీర్ రాజశేఖర్ రెడ్డి తో చర్చించారు. త్వరితగతిన పనులు పూర్తి కావాలని సూచించారు. ఎంబిఏ విభాగాధిపతి డాక్టర్ అమృత్ ప్రసాద్ రెడ్డి, డాక్టర్ ఎస్వి సుబ్బారెడ్డి, డాక్టర్. సుబ్బారెడ్డి, డాక్టర్ .గంగయ్య పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో దున్నపోతుకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు



దున్నపోతుకు వినతులు

ఆకులు, అలుములు తింటూ వినూత్నంగా అంగన్వాడీల నిరసన

ప్రభుత్వ ఆదేశ పత్రాలు దహనం - 22వ రోజూ కొనసాగిన సమ్మె

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ కడప జిల్లాలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం నాటికి 22వ రోజుకు చేరుకుంది. జిల్లా వ్యాపితంగా దున్నపోతుకు వినతి పత్రాలు అందజేసి ప్రభుత్వంపై వ్యతిరేకతను ప్రదర్శిస్తూ నిరసన తెలియజేశారు. మరికొన్ని చోట్ల ఆకులు, అలుములు తింటూ, ఇంకొన్ని చోట్ల మోకాళ్లపై నిల్చుని ఆందోళన చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్వాడీలు మాత్రం సమస్యలు పరిష్కారమయ్యే వరకూ సమ్మె విరమించేది లేదంటూ నినాదాలు చేశారు.



జమ్మలమడుగు : ఆకులు, అలుములు తింటూ అంగన్వాడీల నిరసన

పులివెందుల టౌన్ : స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో 22వ రోజైన మంగళవారం అంగన్వాడీలు నిరసన తెలియజేశారు. సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె ఆగదని చెప్పారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **ముద్దనూరు :** అంగన్వాడీల డిమాండ్లు పరిష్కరించాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు చేపట్టిన సమ్మెకు మంగళవారం ఉపాధ్యాయులు మద్దతు తెలిపారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డుమాండ్ చేశారు.. ప్రభుత్వ మొండి వైఖరి విడనాడాలని నినాదాలు చేశారు. **ప్రొద్దుటూరు :** తమ న్యాయమైన కోర్కెలుసాధించుకునేందుకు అంగన్వాడీ కార్యకర్తలు 22రోజులుగా సమ్మె చేస్తుంటే వారి పట్ల ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం తగదని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ అన్నారు. ప్రభుత్వ విధానానికి నిరసనగా పాతబస్టాండ్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చి అనంతరం రాజీవ్‌సర్కిల్‌లో కొద్దిసేపు రాస్తారోకో నిర్వహించారు. అనంతరం అంగన్వాడీలు ఆకులు తింటూ నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి సుబ్బలక్ష్మి, నాగలక్ష్మి, రాణి, సువార్తమ్మ సునీత, అర్బన్ అంగన్వాడీలు పాల్గొన్నారు. **కడప అర్బన్ :** అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 5 నుంచి విధుల్లో చేరాలని ఆదేశాల పత్రాలు జారీ చేయడంతో మంగవారం ఆ ప్రతులను అంగన్వాడీలు రూరల్ కార్యాలయం ఎదుట దహనం చేశారు. కార్యక్రమంలో ఎపి అంగన్వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి, నాయకులు నాగలక్ష్మి,తులసి, కృష్ణవేణి, సంటేమ్మ, సావిత్రి,రెడ్డెమ్మ, ఈశ్వరమ్మ, గంగోజి పాల్గొన్నారు. అర్బన్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మెకు సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్, డివైఎఫ్ఐ నాయకులు ఓబులేసు సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకురాలు దీప, వసుంధర, వినీల, రమా, పోలమ్మ, వరలక్ష్మి పాల్గొన్నారు. సమ్మెకు యుటిఎఫ్‌ఎఫ్, జెవివి నాయకులు సంఘీభావం తెలియజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి. లక్ష్మిరాజ, జెవివి రాష్ట్ర కార్యదర్శి బి. రాజశేఖర్, జెవివి మహిళా విభాగం కన్వీనర్ సునీత, నగర నాయకులు శివరాం, ఉపాధ్యాయులు సుందరం పాల్గొన్నారు. **చాపాడు :** 22 రోజులుగా తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీలు సమ్మె నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ నాయకులు సుజాత, కార్యకర్తలు, అంగన్వాడీ, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు. **మైదుకూరు :** 22 రోజులుగా అంగన్వాడీలు తమ డిమాండ్లను పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం దున్నపోతు మీద వాన పడినట్లుగా చలించకుండా ఉందని అందుకు నిరసనగ అంగన్వాడీలు దున్నపోతుకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ధనలక్ష్మి, భారతి, చెన్నమ్మ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు జి.లక్ష్మీదేవి, లక్ష్మి, శ్యామల, రాధ, శివలక్ష్మి పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో 22 రోజు అంగన్వాడీలు సమ్మె నిర్వహించారు. అనంతరం దున్నపోతుకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్. భైరవప్రసాద్, సిఐటియు మండల నాయకులు బొజ్జా, గుర్రయ్య, పోరుమామిళ్ల ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు దస్తగిరిమ్మ, జ్యోతిమ్మ, లీలావతి, స్వాతి, రేణుక, రమాదేవి, శ్రీదేవి ,అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** పట్టణంలోని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సమ్మె 22 రోజుకు చేరడంతో ఆకులు, అలములు తింటూ వినూత్న రీతిలో అంగన్వాడీలు నిరసన చేపట్టారు. మంగళవారం జమ్మలమడుగు పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయం ఎదురుగా అంగన్వాడీలు నిరసన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమానికి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, సిపిఎం జమ్మలమడగు కార్యదర్శి ఏసుదాసు మద్దతు తెలియజేసి మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు భాగ్యమ్మ, సిఐటియు నాయకులు దాసరి విజయ్, లక్ష్మీదేవి, జ్యోతి, నరసమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు. **వేంపల్లె:** స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వ హిస్తున్న సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరింది. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ కెసి బాదుల్లా సంఘీభావం తెలిపారు. సమ్మె కార్యక్రమంలో అంగన్వాడీలు పాల్గొన్నారు. **బద్వేలు :** స్థానిక బద్వేలు సమగ్ర శిశు అభివృద్ధి అధికారి కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) బద్వేల్ ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో 22 రోజు మంగళవారం రాష్ట్ర వ్యాప్త సమ్మె నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రభుత్వ తీరును నిరసిస్తూ దున్నపోతుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్టు ప్రధాన కార్యదర్శి ఆర్.హుసేనమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం గోపవరం మండల నాయకులు కదిరయ్య, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, పట్టణ ఉపాధ్యక్షులు జి.వి రమణారెడ్డి, ఎస్.ఆదిల్, అంగన్వాడీ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు కె. సుభాషిని, ప్రాజెక్టు నాయకులు సత్యవతి, కళావతి, విజయమ్మ, తులసమ్మ, వెంకట నరసమ్మ, వసంతమ్మ, శ్రీలత, లీలావతి, కళావతి, కృష్ణవేణి, ప్రవీణ, ఉమాదేవి, లక్ష్మీ నరసమ్మ, మహాలక్ష్మి ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఆదేశ ప్రతులను దహనం చేస్తున్న అంగన్వాడీలు

ఆధార్‌తోనే 'ఉపాధి'!

99.98 శాతం అనుసంధానం

అనర్హులుగా 82 జాబ్‌కార్డుదారులు

మూడు వారాలుగా వేతనాలు పెండింగ్

ఆందోళనలో ఉపాధి కూలీలు



జిల్లాలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఆధార్‌తో అనుసంధానించి వేతనాలు చెల్లించే విధానం ప్రారంభమైంది. జాబ్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానించడంపై విమర్శలు వెల్లువెత్తినప్పటికీ ఆధార్‌తో జాబ్‌కార్డులను అనుసంధానించడాన్ని అమలు చేయడానికే సిద్ధమైంది. గతేడాది జనవరి 30న ఆధార్‌తో జాబ్ కార్డులను అనుసంధానించడం తప్పనిసరి చేశారు. గత నెల 27 నాటికి జాబ్‌కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేసినట్లు తెలుస్తోంది. జిల్లాలోని 82 మంది జాబ్‌కార్డుదారులు ఆధార్ అథంటికేషన్ వెలుపలే మిగిలి పోవడంతో ఉపాధి కరువైంది. కార్మికుని బ్యాంకు ఖాతా, జాబ్‌కార్డు రెండూ ఆధార్‌తో అనుసంధానం కావాల్సి ఉంది. భారతీయ చెల్లింపుల కార్పొరేషన్ మ్యాపర్‌తో కూడా అనుసంధానం చేయాల్సి ఉంటుంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో 3,35,986 జాబ్ కార్డుదారులు ఉన్నారు. వీరికి 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.340 కోట్లతో ఉపాధి హామీ పనులు చేపట్టారు. ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి లక్ష్యాన్ని సునాయాసంగా అధిగమించారు. కేంద్ర ప్రభుత్వం గతేడాది జనవరి 30న ఉపాధిని ఆధార్‌తో అనుసంధానించాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై దేశవ్యాప్తంగా తీవ్ర విమర్శలు వెల్లువెత్తినప్పటికీ వెనక్కి తగ్గలేదు. తీవ్ర వ్యతిరేకతల అనంతరం ఐదు విడతలుగా గడువు ఇస్తున్నప్పటి పేర్కొంది. గతేడాది డిసెంబర్ 27 నాటికి గడువు ముగిసినట్లు ప్రకటించింది. జిల్లాలోని 3,35,986 జాబ్‌కార్డులను అనుసంధానించింది. ఈ లెక్కన 99.98 శాతం అనుసం ధానించింది. ఈలెక్కన 82 మంది ఆధార్ అనుసంధానానికి నోచుకోలేదు.


7 మండలాలు..82 మంది

జిల్లాలోని ఏడు మండలాల పరిధిలోని 82 మంది జాబ్‌కార్డు హోల్డర్లు అనుసంధానం చేసుకోలేదు. కమలాపురం, ఖాజీపేటలో ఒక్కొక్కటి, కొండాపురం, సిద్ధవటంలో ఆరు, లింగాలలో ఏడు, పెద్దముడియం, వీరపునాయునిపల్లెలో ఐదు, రాజుపాలెం రెండు, కాశినాయనలో 11, సింహాద్రిపురంలో ఎనిమిది, వేంపల్లిలో మూడు, వేములలో నలుగురు జాబ్‌కార్డు హోల్డర్లు ఆధార్‌తో అనుసంధానించడం కుదరలేదు.

మూడు వారాలుగా అందని వేతనాలు

జిల్లాలోని 3,35,986 మంది జాబ్‌కార్డు హోల్డర్లకు మూడు వారాలుగా వేతనాలు అందడం లేదు. ప్రతి రోజూ సగటున రూ.261, రూ.24 వెరసి రూ.285 వేతనం చెల్లించాల్సి ఉంది. ఈ లెక్కన వారానికి ప్రతికూలీకి రూ.1,795 చెల్లించాల్సి ఉందని చింతకొమ్మదిన్నె మండలం కొలుములపల్లి గ్రామానికి వీరమ్మ అనే మహిళా ఉపాధి కూలీ పేర్కొనడం గమనార్హం. లక్కి రెడ్డిపల్లి గ్రామానికి చెందిన దొడ్డి గంగయ్య అనే ఉపాధి కూలీ 150 రోజులు ఉపాధి కల్పించాలని కోరుతున్నట్లు చెప్పారు. ఏదేమైనా ఉపాధి హామీ పథకం పనుల కత్తిరింపులపై ఉపాధి హామీ కూలీలకు ఇస్తున్న నీళ్లు, తట్టలకు రూ.18, నీళ్లకు రూ.15 రోజులు, మేట్ల వ్యవస్థను పునరుద్ధరించాలని కోరడం గమనార్హం.

ఆధార్‌తో అనుసంధానించడం తగదు



జిల్లాలోని ఉపాధి హామీ కూలీల జాబ్‌కార్డులను ఆధార్‌తో అను సంధానించడం తగదు. కొందరి వేళ్ల అనుసంధానించడానికి సరిపోకపోవచ్చు. ఫలితంగా ఇటువంటి వ్యక్తులు ఉపాధికి వెలుపలే మిగిలిపోయే అవకాశం ఉంది. ఉపాధి కూలీలకు ఇవ్వా ల్సిన అలవెన్స్‌లను సైతం ఇవ్వాలి.

- ఎ.గోపాలకృష్ణయ్య, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు, కడప.

ఉపాధి కూలి పెంచాలి



ఉపాధి కూలీలకు వేతనం పెంచాలి. ప్రతిరోజూ రెండు పూటలా పనిచేస్తే రూ.285 వరకు పరిమితం అవుతోంది. కూలీలకు ఎటువంటి ఉపయోగమూ లేకుండా పోతోంది. ఆధార్‌తో అనుసంధానం చేయడం ద్వారా వృద్ధులకు ఉపాధి హామీ దూరమయ్యే అవకాశం ఉంది.

- బొగ్గడి ప్రతాప్‌రెడ్డి, కొలుములపల్లి, సికె దిన్నె.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



జిల్లాలో మూడు వారాలుగా ఉపాధి కూలీలకు వేతనాలు పడటం లేదు. రోజంతా శ్రమటోడ్చిన పనులకు సకాలంలో వేతనాలు జమ చేయాలి. వారాల తరబడి ఆలస్యం చేస్తే రానున్న పండుగలు, ఇతర కార్యక్రమాలకు అప్పులు చేసుకోవాల్సి వస్తుంది.

- కె.వెంకటసుబ్బయ్య, లక్కిరెడ్డిపల్లి, సికె దిన్నె.

వంద శాతం అనుసంధానించాం

జిల్లాలోని ఉపాధి జాబ్‌కార్డులకు నూరు శాతం ఆధార్‌తో అనుసంధానం చేశాం. కేవలం 82 జాబ్‌కార్డులకు అథంటికేషన్ చేయడంలో ఇబ్బందులు రావడంతో ఆలస్యమవుతోంది. త్వరలో వీటిని సైతం అనుసంధానం చేస్తాం.

- డి.యధుభూషణ్‌రెడ్డి, డ్వామా పీడీ, కడప.

మున్సిపల్ కార్మికుల భిక్షాటన

8వ రోజూ కొనసాగిన సమ్మె

ప్రజాశక్తి - కడప అర్బన్



కడపలో భిక్షాటన, బద్వేల్‌లో ఆకులు కట్టుకుని నిరసన తెలియజేస్తున్న కార్మికులు

మున్సిపల్ కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం భిక్షాటన చేయిస్తుందని ఎంపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నగర సహాయ కార్యదర్శి ఇత్తడి ప్రకాష్ విమర్శించారు. మంగళవారం నగరంలో మున్సిపల్ కార్మికులు భిక్షాటన చేపట్టారు. పాత మునిసిపల్ ఆఫీస్ వద్ద తెల్లవారు జామున భగత్ సింగ్ నగర్ క్లాప్ ఆటో స్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్పొరేషన్ ఆఫీస్ ఎదుట కార్మికులు భిక్షాటన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ్మె మొదలై 8 రోజులవుతున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని తెలిపారు. బాధ్యత మంత్రి చర్చలతో కాలయాపన చేయడం సమంజసం కాదని చెప్పారు. అధికార వర్గం నుంచి బెదిరింపులకు పాల్పడటం, పోలీసులను మోహరించడం ఇలాంటి చర్యలతో ఉద్యమాన్ని ఎవరు ఆపలేరని హెచ్చ రించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు కంచుపాటి తిరుపాల్, సుంకర రవి నాయకులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు. **జమ్మలమడుగు :** తమ న్యాయమైనా డిమాండ్లు నెరవేర్చాలని మంగళవారం మున్సిపల్ కార్మికులు మస్టర్ పాయింట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ మద్దతు తెలియజేస్తూ మాట్లాడారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను, కార్మికులను, రెగ్యులర్ చేయాలనే ప్రధాన డిమాండ్ అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల పట్ల మొండి వైఖరి వీడి వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేని పక్షంలో నిరవధిక సమ్మెను మరింత ఉధృతం చేస్తామని, చివరకు నిరవధిక నిరాహార దీక్షకు సిద్ధపడతమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, సిఐటియు పట్టణ కార్యదర్శి దాసరి .విజయ్, సిపిఎం పట్టణ నూతన కార్యదర్శి జి.ఏసుదాసు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శేఖర్, జిల్లా కమిటీ సభ్యుడు నాగన్న, కోశాధికారి శివ, మున్సిపల్ సభ్యులు, వర్కర్స్ ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ బాధ్యులు ఎ.వినయ్ కుమార్ పాల్గొన్నారు. **బద్వేలు :** మున్సిపల్ కార్మికులకు జగనన్న ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న సమ్మె 8వ రోజులో భాగంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద బద్వేల్ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియు) పట్టణ కమిటీ ఆధ్వ ర్యంలో మంగళవారం ప్రభుత్వ తీరును నిరసిస్తూ ఆకులు ధరించి తమ నిరసన తెలియజేశారు. ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పఠాన్ చాంద్ బాషా, డివిజన్ కార్యదర్శి షేక్ మస్తాన్, పట్టణ అధ్యక్షులు ఎస్.ఎ. సత్తార్, పట్టణ నాయకులు కె.బి. రసూల్, ఎస్.నాగూర్ లు కార్మికుల సమ్మె శిబిరాన్ని సందర్శించి వారి సంపూర్ణ మద్దతును ప్రకటించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముడియం చిన్ని, పట్టణ ఉపాధ్యక్షులు జివి రమణారెడ్డి, షేక్ ఆదిల్, సిఐటియు పట్టణ నాయకులు రాజగోపాల్, యూనియన్ పట్టణ అధ్య క్షుడు శాంప్రవీణ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు హరి, ఉపాధ్యక్షులు దేవమ్మ, శ్రీని వాసులు, ప్రధాన కార్యదర్శి నాగేంద్రబాబు, కోశాధికారి శివకుమార్, కార్యదర్శులు సత్యరాజు,పాలయ్య, ప్రవీణ్ కుమార్, కమిటీ సభ్యులు చంద్రశేఖర్, రామయ్య, కిరణ్, పెంచల వరప్రసాద్ పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** మున్సిపల్ కార్మికులు చేస్తున్న ఆందోళన మంగళవారానికి 8వ రోజుకు చేరు కుంది. ప్రభుత్వ విధానానికి నిరసనగా పచ్చని ఆకులు తింటూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం (సిఐటియుఅనుబందం) గౌరవాధ్యక్షులు సత్యనారాయణ, పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మన్, అధ్యక్షులు చంటి, కోశాధికారి రాఘవేంద్ర, ప్రమీలమ్మ, గుర్రమ్మ, రమాదేవి, ఓబయ్య, సురేష్, జాకోబు, మోహన్ పాల్గొన్నారు.

'పది'లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప



మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

ఈ విద్యా సంవత్సరం 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో వైఎస్ఆర్ జిల్లా వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ స్పందన హాలులో అన్ని పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, విద్యార్థుల ఆరోగ్యం, మనబడి 'నాడు- నేడు' ఫేస్-2 పనుల పురోగతిపై కలెక్టర్, ఎస్ఎస్ఎ పిఒ అంబవరం ప్రభాకర్ రెడ్డి, డిప్యూటీ కలెక్టర్ ప్రత్యూష, ఐసిడిఎస్ పీడీ శ్రీలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ వీరన్న లతో కలిసి విద్యాశాఖ, ఎగ్జిక్యూటివ్ ఏజెన్సీ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి మంచి ఫలితాలు తీసుకొచ్చేందుకు కృషి చేయాలన్నారు. పదవ తరగతి సిలబస్ త్వరితగతిన పూర్తి చేసి రివిజన్ కూడా చేపట్టేలా విద్యాశాఖ అధికారులు చొరవ చూపాలన్నారు. గత ఏడాది టెన్త్ లో వచ్చిన ఫలితాలను బేరీజు చేసుకుని, సబ్జెక్టు ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి ఏవైనా లోటుపాట్లుంటే సరిచాలేని చెప్పారు. విద్యా ప్రమాణ పెంపునకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ ఏడాది పదవ తరగతి పరీక్షా ఫలితాలో రాష్ట్రంలో వైఎస్ఆర్ జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని విద్యాశాఖ అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. 6వ తరగతి నుండి అన్ని తరగతులకు ఐఎఫ్‌పి ఇన్‌స్టాలేషన్ కచ్చితంగా జరగాలన్నారు. పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యంపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. నాడు- నేడు పనుల్లో ఎక్కడైనా అసంపూర్తిగా ఉంటే త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎన్నికల సన్నద్ధత గురించి మాట్లాడుతూ మండల తహశీల్దార్ సహకారంతో సంబంధిత ఇంజినీరింగ్ టీమ్ తో కలిసి తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లలో అన్ని రకాల మౌలిక సదుపాయాలను సిద్ధం చేయాలని ఎంఇఒలను ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్, ఎపి ఇడబ్ల్యుఐడిసి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఇ, మండల ఇంజనీర్లు, ఇంజినీరింగ్ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

కడప జ్యువెలరీ అసోసియేషన్ సభ్యులకు సన్మానం

ప్రజాశక్తి - కడప అర్బన్



సన్మానం పొందిన అసోసియేషన్ సభ్యులు

నగరంలోని వైవి స్ట్రీట్‌లో ఉన్న ఎస్ఎల్‌వి జ్యువెలర్స్ కార్యా లయంలో నూతన సంవత్సరం ప్రారంభమైన శుభ సందర్భంగా ఎస్ఎల్ వి జ్యువెలర్స్ అధినేత ఎస్.ఎల్.వి రమణ ఆధ్వర్యంలో కడప జ్యువెలరీ అసోసి యేషన్ గౌరవ అధ్యక్షులు బంగారు రాజా, సయ్యద్ సలావుద్దీన్, అధ్యక్షుడు ఆకుల రాజమోహన్ సంఘ సభ్యులను ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఎస్.ఎల్.వి రమణ చేస్తున్న సేవలను ప్రత్యేకంగా అభినందిస్తూ, సన్మానించారు. కార్యక్రమంలో కడప జ్యువెలరీ అసోసియేషన్ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న విష్ణుప్రీతంరెడ్డి

కడప : కడప నగరంలోని 50 డివిజన్ బలోపేతం దిశగా చేస్తామని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రీతం రెడ్డి, జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములు అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కడప అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన 50 డివిజన్ల ఇన్‌ఛార్జిల సమావేశం నగర అధ్యక్షులు వై. విష్ణు ప్రితమ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు గుండ్లకుంట శ్రీరాములతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా పార్టీలోకి మహమ్మద్ అలీ ఖాన్, అన్వర్ బాష, ఫైరోజ్ ఖాన్, ఫరీదుద్దీన్ ఖాన్, క్రాంతి, సునీల్ కుమార్ రెడ్డి చేరారు. కార్యక్ర మంలో మధు రెడ్డి, బండి జకరయ్య,అబ్దుల్ సత్తార్, చీకటి చార్లెస్, పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, పొట్టిపాటి చంద్రశేఖర్ రెడ్డి, మల్లెం విజయభాస్కర్, మామిళ్ళ బాబు, పాలగిరి శివ పాల్గొన్నారు.

కార్మికవర్గ పోరాటాలపై నిర్లక్ష్యం తగదు : సిపిఎం

ప్రజాశక్తి - కడప అర్బన్



ఆందోళన చేస్తున్న సిపిఎం నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం కార్మిక వర్గ పోరాటాలను నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం తగదని, తక్షణమే వారి కోరికలు పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు ఐ.ఎన్. సుబ్బమ్మ, నగర కార్యదర్శి ఎ. రామమోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని పూలే సర్కిల్లో కార్మికవర్గ పోరా టాలకు సంఘీభావంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వర్గంపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టినట్టు స్పష్టంగా అర్థమవుతుందని చెప్పారు. ముఖ్యమంత్రి గతంలో అం గన్వాడీ కార్యకర్తలు, మున్సిపల్ కార్మికులు, తదితర రంగాల ఉద్యోగులు, కార్మి కులకు ఇచ్చిన హామీ నెరవేర్చేందుకు కృషి చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పిఆర్‌సి, డిఎ బకాయిలు వేల కోట్లలో పెండింగ్‌లో ఉన్నాయని, తక్షణమే చెల్లింపులు చేపట్టాలని పేర్కొన్నారు. సమస్యలను పరిష్కా రం చేసి పోరాటాలను విరమింపజేయకుండా నిర్బంధం, బెదిరింపుల ద్వారా, కార్మికుల మధ్య ఐక్యతను విచ్ఛిన్నం చేయడం కోసం ప్రయత్నం చేస్తోం దన్నారు. ఈ పద్ధతుల ద్వారా కార్మికుల పోరాటాలను నిర్వీర్యం చేయడం సాధ్యం కాదని వారన్నారు. కార్మికులు గొంతెమ్మ కోరికలు కోరలేదని, పరిష్కా రానికి అవకాశం ఉన్న సమస్యలు మాత్రమే అడుగుతున్నాని పేర్కొన్నారు. జిల్లాలో కార్మికుల ఐక్యతను చీల్చే ప్రయత్నం అధికార పార్టీ నేతలు తక్షణమే ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు జమీ ల, మహబూబ్ తార, షకీలా, రమాదేవి, వెంకట సుబ్బమ్మ, కామేశ్వరమ్మ, లతీఫా, రసూలా, అల్లాబీ, ఎం వెంకటేశ్వర్లు, షాకీర్, గోవిందు పాల్గొన్నారు.

వాహనాలు తొలగించాలి

కడప : ట్రాఫిక్‌కు ఆటంకంగా ఉన్న చైతన్య కళాశాల వాహనాలను తొలగించాలని కోరుతూ మంగళవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తార్ కడప మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన కడప నగరంలోని ప్రధాన కూడళ్లల్లో ఒకటైన కోటిరెడ్డి సర్కిల్లో చైతన్య జూనియర్ కళాశాల సిబ్బంది, విద్యార్థుల వాహనాలను, మేనేజ్మెంట్ వారు తమ భవనంలో పార్కింగ్ చేసుకోకుండా ఎస్‌పి బంగ్లా వరకు వందలాది సంఖ్యలో పార్కింగ్ చేస్తున్నారని చెప్పారు. చిన్నపాటి చిన్నపాటి తమ తోపుడు బండ్లు పెట్టుకుంటే కడప మున్సిపల్ కార్పొరేషన్ వారు ఫైన్‌లు, పోలీసు వారైతే తిట్టి, కొట్టి ఫైన్ వేసి తీయించేస్తున్నారని పేర్కొన్నారు.. చైతన్య కళాశాల వాహనాలు కనపడనట్లు కిమ్మనకుండా ఉన్నారన్నారు. కమిషనర్ మాట్లాడుతూ అందరికీ న్యాయం చేస్తామని, ఈ విషయమై తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

నేడు ఎమ్మెల్యే రాక

చెన్నూరు : కమలాపురం శాసనసభ్యులు పోచంపల్లి రవీంద్రనాథ్‌రెడ్డి బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో నిర్వహించబోయే పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారని ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వృద్ధాప్య ,వితంతు పెన్షన్లను రూ. 2750 నుంచి రూ 3 వేలు పెంచిన, కొత్తగా మంజూరైన వారికి ఆయన పంపిణీ చేస్తారన్నారు. మండల పార్టీ నాయకులు, అధికారులు పాల్గొంటారు

కొత్త నల్లాయపల్లె సమస్యలు పరిష్కరించాలి

అట్లూరు : మండలంలోని కొత్త నల్లాయపల్లెలో నెల కొన్న సమస్యలను పరిష్కరించాలని బహుజన సమాజ్ పార్టీ బద్వేల్ ఇన్‌ఛార్జి సుసిమి గౌస్‌పీర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ గ్రామంలో పదేళ్లగా 25 కుటుంబాలు నివాసముంటున్నాయని చెప్పారు. విద్యుత్, తాగునీరు, రోడ్లు వంటి సమస్యలు గ్రామంలో ఉన్నాయని చెప్పారు. పూరి గుడిసెల్లో నివాసముంటున్నారని, వారి ఇంత వరకు పక్కా గృహాలు మంజూరు చేయించలేదని, ఎవరూ పట్టించుకోకపోవడం దుర్మార్గమని చెప్పారు.


పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

అర్హులందరికీ పింఛన్లు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - దువ్వూరు

అర్హులందరికీ పెన్షన్ మంజూరైనట్లు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చింతకుంట, బుక్కాయపల్లె గ్రామాల్లో మంగళవారం వైఎస్ఆర్ పెన్షన్ కార్యక్రమం నిర్వహించారు. గతంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ప్రతి లబ్ధిదారుడికి రూ.3000 పింఛన్ అందిస్తామని చెప్పారన్నారు. పార్టీలకు అతీతంగా పింఛన్ నేడు మైదుకూరు నియోజకవర్గంలోని 35,074 మందికి దాదాపు రూ.10 కోట్ల 52 లక్షలు పింఛన్ రూపంలో అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైసిపి సమన్వయ కార్యకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, ఎంపిపి కానాల జయచంద్రారెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి కానాల ఓబుల కొండారెడ్డి, కోగోటం వీరారెడ్డి, మండల కన్వీనర్ చిరాకి బాషా, సంఘన హరిహరనాథరెడ్డి పాల్గొన్నారు

నేడు 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి - దువ్వూరు

ఏవైనా సమస్యలు ఉంటే బుధవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అధికారుల దృష్టికి తేవాలని తహశీల్దార్ రమాకుమారి సూచించారు. మండలంలోని రైతులు, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమాన్ని స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో కలెక్టర్ అధ్యక్షతన నిర్వహిస్తామన్నారు. విజయవంతం చేయాలని ఆమె అధికారులను కోరారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఇఒ జాఫర్ సాదిక్

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి

ప్రజాశక్తి - వేంపల్లె

విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేకదృష్టి పెట్టి బోధించాలని ఎంఇఒ జాఫర్ సాదిక్ కోరారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో మంగళవారం ప్రాథమిక, సెకండరీ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని ఎంఇఒ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థికి కనీస అభ్యసన సామర్థ్యాలైన చదవడం అనేది అలవాటు చేయాలని కోరారు. బోధన పద్ధతిలో ఉపాధ్యాయులకు ఎదురయ్యే సమస్యలను నివృత్తి చేసుకునేందుకు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు చాలా ఉపయోగ పడుతాయన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలకు విధిగా హాజరుకావాలన్నారు. విద్యార్థి అభ్యసన స్థాయిని పెంచేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ శివ మునెమ్మ, హెచ్ఎం దస్తగిరి, నాగాంజనేయులు, రవికుమార్, సంజీవకుమార్, డిఆర్‌పి చెరుకూరి శ్రీనువాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


నేత్రాలయానికి కార్నియాలను అందిస్తున్న కుటుంబ సభ్యులు

నర్రెడ్డి పుల్లమ్మ నేత్రదానం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణానికి చెందిన నర్రెడ్డి పుల్లమ్మ (93) మంగళవారం తెల్లవారు జామున మరణించడంతో ఆమె కుమారులు శివప్రకాష్‌రెడ్డి, రాజశేఖరరెడ్డి, కుమార్తెలు సర్వేశ్వరమ్మ, సౌభాగ్యమ్మ, శివలక్ష్మి, రాజేశ్వరి, లక్ష్మీదేవి, కోడళ్లు అరుణ, సునీత, అల్లుళ్లు నారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, స్టాన్ లీ రెడ్డి, రామసుబ్బారెడ్డి నేత్రదానానికి అంగీకరించారు. ఆ మేరకు స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్ర సేకరణ కేంద్రం అధ్యక్షులు రాజుకు సమా చారమి చ్చారు. టెక్నీషియన్ హరీష్‌తో హుటాహుటిన మృతురాలి ఇంటికెళ్లి పార్థివ దేహం నుండి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నేత్రదానంపై అవ గాహన కలిగి 99665 09364, 70932 04537కు సమాచారం ఇవ్వాలని కోరారు. నేత్రదానానికి అంగీకరించిన పుల్లమ్మ కుటుంబ సభ్యులకు పుర ప్రము ఖులు, బంధువులు, సన్నిహితులు, సేవాసమితి బృందం కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి

ప్రజాశక్తి - వల్లూరు

వల్లూరు సమీపంలోని పంట పొలాల వద్ద వేప చెట్టుకు ఉరి వేసుకుని అనుమానాస్పద స్థితిలో బాలుడు మృతి చెందినట్లు మంగళవారం వల్లూరు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. కొప్పోలి గ్రామానికి చెందిన పొట్లి అనిమేష్ (16) గుండె జబ్బుతో బాధపడుతున్నాడని వారి కుటుంబ సభ్యులు తెలిపారన్నారు. సోమవారం మధ్యాహ్నం నుండి అనిమేష్ ఇంటి వద్ద లేరని కుటుంబసభ్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


మృతి చెందిన అనిమేష్

బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రోషన్ హెచ్చరించారు. బుధ వారం మండల పరిధిలోని బలపనూరులో బెల్ట్ షాప్ నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించడం చట్టరీత్యా నేరమన్నారు. ఇలాంటివి నిర్వహిస్తే తమ దృష్టికి తేవాలని ఆయన సూచించారు.


అరెస్టు చూపుతున్న పోలీసులు

వరిగడ్డి కొరత.. పాడి రైతుల్లో వ్యధ

ప్రజాశక్తి - చాపాడు

తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో కెసి కెనాల్ ఆయకట్టు పరిధి పొలాలు చాలా వరకు బీళ్లుగా మారాయి. ఈ ప్రభావంతో పాడిరైతులకు పశుగ్రాసం కరువైంది. ఈ ప్రాంతంలో పాడిపై ఆధారపడి జీవించేవారు కూడా ఎక్కువే. ఈ ఏడాది ఖరీఫ్‌లో అంతోఇంతో సాగైన వరి నూర్పిళ్లు పూర్తవుతున్నాయి. ఈ నేపథ్యంలో వరి గడ్డి సేకరణకు పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతేడాదిలో వరి పంట అధికంగా నేల కొరగడం, వర్షం దెబ్బకు వరిగడ్డి కూడా దెబ్బతింది. అంతేకాకుండా నేలకొరిగిన వరి పంటను చైన్‌లతో నడిచే వరికోత మిషన్ల ద్వారా పంట నూర్పిడి చేపట్టారు. ఈ మిషన్ల ద్వారా నూర్పిడి చేయడంతో వరి గడ్డి ఏమాత్రం పనికిరాకుండా పోయింది. టైర్ల మిషన్ల ద్వారా, కూలీల ద్వారా నూర్పిడి చేసిన వరిపంట నుండి మాత్రమే వరిగడ్డి లభ్యమైంది. గత ఖరీఫ్‌లో మండల పరిధిలో 16 వేల ఎకరాల్లో వరి పంట సాగు చేయగా 10 వేల ఎకరాలు తుఫాన్ తాకిడికి నేలకొరిగింది. ప్రస్తుతం మైదుకూరు, చాపాడు, ఖాజీపేట, దువ్వూరు, బి.మఠం మండలాల్లో 10వేల ఎకరాల్లో మాత్రం వరి పంటను సాగు చేపట్టారు. పెన్నా, కుందూ తీర ప్రాంతంలో ముందస్తుగా సాగు చేసిన 3వేల ఎకరాలలో వరి పంట నూర్పిడి చేపడుతున్నారు. దీంతో వరిగడ్డి లభిస్తుండడంతో పాడి రైతులు సేకరణ చేపడుతున్నారు. ఎకరా వరిగడ్డి రూ.5 వేల నుంచి రూ.6వేల వరకు ధర పలుకుతోంది. మిషన్ల ద్వారా నూర్పిడి చేసిన వరిగడ్డిని ట్రాక్టర్‌తో కట్టలు కట్టిస్తున్నారు. ఒక కట్ట వరిగడ్డి కట్టడానికి రూ.30 వసూలు చేస్తున్నారు. ఒక్కొక్క కట్ట రూ.140తో అమ్మ కాలు చేపడుతున్నారు. అయితే ఈ విధానం ద్వారా వరిగడ్డిని కట్టలుగా మార్చి రవాణా సులభతరం అవుతుందని రైతులు పేర్కొంటున్నారు. ఈ వరి గడ్డిని కట్టలు కట్టించేందుకు రవాణాతో కలిపి రూ.9 వేలకు పైగా అవు తోందని పాడి రైతులు వాపోతున్నారు. వివిధ మండలాల నుండి రైతులు చాపాడు ప్రాంతంలో వరిగడ్డిని కొనుగోలు చేసి తీసుకెళుతున్నారు.


ట్రాక్టర్‌లో తరలిస్తున్న వరిగడ్డి

గ్రామీణ ప్రాంతాల్లో ఆధునిక వైద్య సేవలు


మాట్లాడుతున్న శ్రీకాంత్‌రెడ్డి, వైద్యాధికారులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

గ్రామీణ ప్రాంత ప్రజలు ఆధునిక వైద్య సేవలను సద్విని యోగం చేసుకోవాలని వైసిపి మండల కన్వీనర్ శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సుంకేసులలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేద ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమం ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమూర్తి, సర్పంచ్ శ్యామలాదేవి, డిప్యూటీ డిఎంహెచ్ఒ ఖాజామొద్దీన్ సాహెబ్, వైద్యులు హుస్సేన్‌బాషా, హిమబిందు, రమణ, అధికారులు పాల్గొన్నారు.

చాపాడు : జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు ఎంతో ఉపయో గమని ఎంపిపి టి.లక్షుమయ్య తెలిపారు. మండల పరిధిలోని అల్లాడుపల్లె గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యంపై చర్యలు చేపట్టిందన్నారు. ముఖ్యంగా కంటి పరీక్షలకు అన్ని రకాల పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మండల ప్రత్యేకాధికారి సురేష్‌రెడ్డి, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, డాక్టర్ రాజేష్‌కుమార్, సర్పంచ్ జిఎం కిశోర్‌కుమార్‌రెడ్డి, వైద్య సిబ్బంది రాఘవయ్య, సరస్వతి, భాస్కర్, రమేష్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ప్రజలకు మందులు పంపిణీ చేస్తున్న ఎంపిపి టి.లక్షుమయ్య

రెండు నెలల్లో పనులు పూర్తి : ఎంపీ


నల్లేరు విశ్వనాథరెడ్డిని కలిసిన ఎంపీ, మేయర్

ప్రజాశక్తి-కాశినాయన

మండలంలో ఎడమ కాలువ నుంచి వరి కుంట్ల చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్ పనులను రెండు నెలల్లో పూర్తి చేయిస్తామని కడప ఎంపీ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. రూ. 16 కోట్లతో మంజూరైన లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ఎంతో పట్టుదలతో ప్రజల సంక్షేమం కోసం ఇలాంటి లిఫ్టు ఇరిగేషన్ పనులు చేపడుతోందని చెప్పారు. ఎన్ని ఇబ్బందులున్నా ప్రజలు, రైతుల అభివృద్ధి కోసం ఇలాంటి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఎడమ కాలువ 32వ కిలోమీటర్ దగ్గర లిఫ్ట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. వరికుంట్ల చెరువు నుంచి బాలయ్యపల్లె, గొంటు వారి పల్లె, గంగనపల్లె చెరువులకు నీరు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కడప మేయర్ సురేష్ బాబు మాట్లా డుతూ టిడిపిహయాంలో బ్రహ్మ సాగర్ ప్రాజెక్టు విషయంలో ఏ ఒక్క రూపా యి కూడా ఖర్చు చేయలేదని అన్నారు. ఎమ్మెల్సీ డి.సి. గోవిందరెడ్డి, ఎమ్మెల్యే సుధా మాట్లాడుతూ కొందరు టిడిపి నాయకులు పాదయాత్రలో వైసిపిలో అభివృద్ధి శూన్యమని చెప్పటం సరైందని కాదని పేర్కొన్నారు. అభివృద్ధి ఒక్క వైఎస్ఆర్ పాలనలోనే జరిగిందని చెప్పారు. ఇంకా కొన్ని లిఫ్టు ఇరిగేషన్లు అవసరమని, వాటిని కూడా త్వరలో ప్రారంభిస్తామని డిసి గోవిందరెడ్డి చెప్పారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రమణారెడ్డి మాట్లాడుతూ ఇక్కడ ఏర్పాటు చేసే లిఫ్ట్ ఇరిగేషన్‌కు శ్రీ అవధూత కాసినాయన పేరు, కలస్పాడు మండలంలో ఏర్పాటు చేసే లిఫ్ట్ ఇరిగేషన్‌కు డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి పేరు నామకరణం చేయాలని ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డిని కోరారు కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిటీ చైర్మన్ చిత్త విజయప్రతాపరెడ్డి, నాగార్జున రెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నల్లేరు విశ్వనాథరెడ్డిని కలిసిన ఎంపీ, మేయర్

బద్వేలు నియోజకవర్గ వైసిపి నాయకులు, కాశినాయన మండల మాజీ అధ్యక్షులు, ప్రస్తుత వైసిపి మండల కన్వీనర్ నల్లేరు విశ్వనాథరెడ్డిని కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి,, కడప మేయర్ సురేష్ బాబు పోరుమామిళ్లలోని ఆయన స్వగృహంలో ప్రత్యేకంగా కలిశారు ఈ సందర్భంగా బద్వేలు నియోజకవర్గ వైసిపి రాజకీయ స్థితిగతులు క్లుప్తంగా అడిగి తెలుసుకున్నారు. బద్వేల్ రాజకీయ పరిస్థితుల గురించి అడిగి తెలుసుకొన్నారు. బద్వేల్‌లో ఏ విధంగా ఏమి చేస్తే పార్టీ బలపడుతుంది అని చర్చించినట్లు తెలిసింది. ముందుగా ఎంపీ అవినాష్‌రెడ్డిని విశ్వనాథరెడ్డి, ఆయన అనుచరులు శాలువతో సన్మానించారు కార్యక్రమంలో గంగనపల్లె సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి మరికొంతమంది కాశినాయన, పోరుమామిళ్ల మండలాల వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ప్రకటనకు ముందే మార్పులు, చేర్పులు

జమ్మలమడుగు రూరల్ : ఓటు ఉండి జాబితాలో తప్పులు ఉన్న ఓటర్లు త్వరగా మార్పులు, చేర్పులు చేసుకోవాలని, ఎన్నికల నోటిఫికేషన్ (ప్రకటన) వచ్చిన తర్వాత వాటికి అవకాశం ఉండదని ఆర్‌డిఒ జి.శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఆర్‌డిఒ ఛాంబర్‌లో మంగళవారం ఆయన రాజకీయ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ ప్రజా ప్రతిని ధులు, మాజీ ప్రజాప్రతినిధులు తమ ఓటు జాబితాలో ఉందోలేదో తప్పక చూసుకోవాలన్నారు. ఓటు హక్కు ఉన్నవారు మాత్రమే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులన్నారు. జిల్లాలో అతి పెద్ద నియోజకవర్గం జమ్మల మడుగులో 315 పోలింగ్ కేంద్రాలున్నాయన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా రాజకీయ ప్రతినిధులు సహకరించాలన్నారు. 315లో 170 పోలింగ్ కేంద్రాలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా భారీ భద్రత పెడుతున్నామన్నారు.ఎలక్షన్ డిప్యూటీ తహ శీల్దార్ షఫీ, ఎలక్షన్ సీనియర్ అధికారులు మస్తాన్‌వలి, వివేకానందరెడ్డి, రాజకీయ ప్రతినిధులు పోచిరెడ్డి, సీతారాముడు, గంగాధర్, శంకర్‌రెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యం చేయరాదు

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అల్లాడుపల్లె సచివాలయంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్, బద్వేలు సహాయ వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వి.మల్లేష్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ జాస్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండకూడదని హెచ్చరించారు. అన్ని రకాల మందులు, రిజిష్టర్లను తనిఖీ చేశారు. మందుల గురించి ఫార్మసిస్ట్ సుభాషిణిని అడిగి తెలుసుకున్నారు. ముందుగా చాపాడు వైద్యాధికారులు డాక్టర్ రాజేష్‌కుమార్, డాక్టర్ కావ్య మాధురి, డాక్టర్ ఓబులేసు, డాక్టర్ శ్రీవాణి కార్యక్రమం గురించి చర్చించారు. అంతకుముందు జిల్లా మలేరియా అధికారి, జాస్ స్పెషల్ ఆఫీసర్ మనోరమ పర్యవేక్షించి, డాక్టర్లకు సూచనలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి వెంకటరెడ్డి, సిహెచ్ఒ మహాదేవ్ యాదవ్, ఆరోగ్య విస్తరణ అధికారి యం.రాఘవయ్య, ఆశ నోడల్ పర్సన్ సుకన్య, సూపర్వైజర్ బాబురెడ్డి, సరస్వతి, హెల్త్ అసిస్టెంట్స్, రమేష్, భాస్కర్, యంఎల్‌హెచ్‌పిలు, ఏయన్‌యంలు, ఆశా కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.


సిబ్బందితో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం


పుట్టాకు హారతిస్తున్న మహిళ

ప్రజాశక్తి - ఖాజీపేట

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని, రానున్న ఎన్నికల్లో ప్రజలందరూ చంద్రబాబుకే పట్టం కట్టాలని మైదుకూరు నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి పుట్టా సుధాకర్ యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పత్తూరు గ్రామంలో భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టా సుధాకర్ యాదవ్‌కు గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ ఉపసర్పంచ్ ముత్తూరు రమణ నాయుడు, పిచ్చి నాయుడు, పుల్లయ్య నాయుడు, రామానాయుడు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా టిడిపి మినీ మేనిఫెస్టో గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల శాఖ అధ్యక్షుడు తిప్పిరెడ్డి లక్ష్మిరెడ్డి, రాష్ట్ర ముస్లిం మైనారిటీ కార్య నిర్వాహక కార్యదర్శి సిద్ధారం ఖదిరుల్లా, మండల టిడిపి సీనియర్ నేత సందుల నాగశివారెడ్డి, తుట్టే రాము యాదవ్, గడ్డం జానకిరామ్, నంద్యాల సుబ్బయ్య యాదవ్, మామిళ్ల కృష్ణారెడ్డి, సరిటాల వీరయ్య, త్రిపురవరం హరినాథ్‌రెడ్డి, కొంగాని వెంకట సుబ్బయ్య యాదవ్, హబీబ్, బండి చిన్న, సారె రంగయ్య పాల్గొన్నారు.

రామాలయ నిర్మాణానికి పుట్టా ఆర్థిక సాయం : మండల పరిధిలోని పత్తూరు గ్రామంలో నూతనంగా నిర్మించనున్న రామాలయ నిర్మాణానికి పుట్టా సుధాకర్ యాదవ్ తన వంతు ఆర్థిక సహాయం అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ మొత్తాన్ని ఆలయ కమిటీ పెద్దలకు అందజేయనున్నారు.


క్రికెట్ స్టేడియాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, అధికారులు

త్వరగా పనులు పూర్తవ్వాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయ్‌రామరాజు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన ఒఎస్‌డి అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి పులివెందుల పట్టణం లోని క్రికెట్ స్టేడియం, బనానా ప్యాక్ హౌస్ పనులను పరిశీలించారు. ఈ సంద ర్భంగా పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్‌అండ్‌బి గెస్ట్‌హౌస్‌లో శాఖల వారీగా సమీక్షించారు. అవసరమైన సూచనలు ఇచ్చారు. పనుల్లో ఎక్కడా రాజీ పడకుండా పూర్తి చేసేందుకు అధికారులు సంసిద్ధంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, ఆర్‌అండ్‌బి ఇఇ సిద్ధారెడ్డి, మోడల్ టౌన్ ప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.


రేషన్ షాప్‌లను పరిశీలిస్తున్న తహశీల్దార్ గుర్రప్ప

రేషన్ పంపిణీలో అలసత్వం తగదు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రేషన్ పంపిణీలో అలసత్వం తగదని జమ్మలమడుగు తహశీల్దార్ గురప్ప తెలిపారు. మంగళవారం పట్టణ, మండల పరిధిలోని రేషన్ షాపులను, డోర్ డెలివరీ వాహనాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రతి ఇంటికెళ్లి రేషన్ పంపిణీ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వాహనాలను ఏర్పాటు చేసిందన్నారు. అవి సక్రమంగా అమలు అవుతుందా లేదా అనే విషయమై ఉన్నతాధికారులు నిఘా ఉంచాలని చెప్పారన్నారు. ఇందులో భాగంగా కన్నెల్లూరు, బీసీ కాలనీ, కాపువీధిలో షాపులను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


కార్డులను పంపిణీ చేస్తున్న డాక్టర్ సంపత్‌కుమార్

మాతా శిశు సంరక్షణ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మాతా శిశు సంరక్షణ కార్డులను డాక్టర్ సంపత్‌కుమార్ మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ గర్భం దాల్చినది మొదలుకొని జన్మించిన తర్వాత కూడా వారికి ఏఏ ఇంజక్షన్లు ఇవ్వాలి.. వారి పుట్టు పూర్వోత్తరాలు ఆర్‌సిహెచ్ (మాతా శిశు సంరక్షణ) రికార్డుల్లో సంక్షిప్తమై ఉంటుందన్నారు. వీటిని జాగ్రత్తగా నిర్వహించాలని డాక్టర్ సంపత్‌కుమార్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే నిర్వహించారు. ఏఎన్ఎంలకు, సిహెచ్ఓలకు ఆర్‌సిహెచ్ రికార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు పుష్పరాజ్, ఎల్వి రమణమ్మ, హెల్త్ అసిస్టెంట్ మాధవ నాయుడు, ల్యాబ్ టెక్నీషియన్ రమణ, ఏఎన్ఎంలు, సిహెచ్‌వోలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.


గ్యారంటీ పత్రాలను అందజేస్తున్న భూపేష్‌రెడ్డి

వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దింపాలని టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి సి.భూపేష్ సుబ్బరామిరెడ్డి అన్నారు. మంగళవారం సాయంత్రం మున్సిపాలిటీ పరిధిలోని 11,12వ వార్డులో బాబు ష్యూరిటీ, భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి అన్ని రకాల ఛార్జీలు, పన్నులు పెంచి పేద మధ్యతరగతి వారికి ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు. మళ్లీ వైసిపికి పట్టం కడితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అంధకారం అవుతుందన్నారు. ప్రజలు మేలుకొని రానున్న ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిగా, తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, జింకల బాషా, చెన్నయ్య, అబ్దుల్, కరీం, సుధాకర్, శ్రీనివాసులు, అంబవరం రామయ్య, కొండయ్య యాదవ్, టిడిపి, జనసేన పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ఆదర్శనీయులు ఉపాధ్యాయుడు పెంచలయ్య

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

కష్టానికి తగ్గ ఫలితం ఎప్పుడూ ఉం టుందని ఎటిఎఫ్ జిల్లా కార్యదర్శి రవీంద్రుడు అన్నారు. స్థానిక దస్తగిరి పేట పురపాలక ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యా యుడిగా విధులు నిర్వహి స్తున్న పెంచలయ్య 2023 సంవత్సరంలో ఒక్కరోజు కూడా సెలవు పెట్టకుండా పాఠశాలకు హాజరైనందుకు మంగళవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా రవీంద్రుడు మాట్లాడుతూ విద్యార్థుల అభివృద్ధిని ఆకాంక్షించి ఏడాది అంతా అంకితభావంతో పనిచేసిన పెంచలయ్యను ఇతర ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఇలాంటి వారికి అధికారుల అశీస్సులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో దొరసానిపల్లి హెచ్‌యం కొండారెడ్డి, అనిబిసెంట్ హెచ్‌యం గుర్రప్ప పాల్గొన్నారు.


పెంచలయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు